క్లుప్తంగా

పార్టీ బలోపేతమే లక్ష్యం

పెళ్లకూరు: 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుకు సాగుతామని ఎన్డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి అన్నారు. కొత్తగా ఎన్నికైన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డిని శనివారం చిల్లకూరులో సన్మానించి, అభినందనలు తెలిపారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో కార్యకర్తలు, నాయకులను సమైక్యపరిచి పార్టీ అభివృద్ధికి కృషి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామన్నారు.

చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడిపై ఫిర్యాదు



ఎస్‌ఐకి ఫిర్యాదు కాపీని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా బాధ్యులు

కలువాయి: ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడిపై వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గం సోషల్ మీడియా విభాగం కన్వీనర్ సయ్యద్ హబీబుల్లా, కోకన్వీనర్లు వినీత్, కార్తీక్ శనివారం ఎస్ఐ మహేంద్రకు ఫిర్యాదు చేశారు. వారు తమ ప్రసంగాల ద్వారా యువతను చెడగొట్టి, అల్లర్లకు ఉసిగొల్పుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వైభవంగా గౌరమ్మ కల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న పూజారి బాబు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేట అరుంధతీయవాడలో ఉన్న మాతాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న కొలుపులో భాగంగా శనివారం రాత్రి గౌరమ్మ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద పూజారి బాబు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మాతపరమేశ్వరి ముగ్గు వేసి అమ్మవారికి నిమ్మకాయలతో అలంకరించి, పూజలు చేశారు. రాత్రి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గొల్లభామ చల్ల కథ భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు పీ నాగార్జున, డీ రవి పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు ఉపయోగం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

సూళ్లూరుపేట రూరల్: భూ హక్కు, భూ రక్ష పథకం రీ సర్వే రైతులకు ఎంతో ఉపయోగమని తహసీల్దార్ కే రవికుమార్ తెలిపారు. సూళ్లూరుపేటలోని సుగ్గుపల్లెలో జగనన్న భూ హక్కు, భూరక్ష పథకంపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూములను రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించి పత్రాలను తీసుకుని పొలం వద్దే ఉండాలన్నారు. రైతులందరూ భూమి రీసర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఏబీ చైర్మన్ ఎం.దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కృతజ్ఞతలు

సైదాపురం: మండలానికి చెందిన వీ ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పదవి ఇప్పించినందుకు ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేదురుమల్లి ఆశీస్సులతో తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా తనని నియమించారని వీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

కలసికట్టుగా పనిచేస్తాం

నాయుడుపేటటౌన్: భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం నాయకులంత కలసికట్టుగా పనిచేస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని కేకే కళ్యాణ్ సదన్‌లో శనివారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సన్నరెడ్డి దయాకర్‌రెడ్డికి ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఈ సభలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీకి చెందిన దయాకర్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కోలా ఆనంద్,ముని సుబ్రహ్మణ్యంను నెల్లూరు, తిరుపతి జిల్లాల నాయకులు ఘనంగా సత్కరించారు.

ప్రతి నిరుద్యోగికీ ఉద్యోగ అవకాశం



సైదాపురం: బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి

వెంకటగిరిరూరల్: నియోజకవర్గంలో ప్రతి నిరుద్యోగికీ ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తాను తీసుకోనున్నట్లు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్‌జేఆర్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేందుకు నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8వ తేదీన ఎస్‌జేఆర్ భవనంలో బహుళ కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనున్న అభ్యర్థులు 90109 02009 , 90590 69067 నంబర్లు క్యూఆర్‌కోడ్, లింక్‌ల ద్వారా తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఐఐహెచ్‌టీ మరింత అభివృద్ధికి కృషి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)ను మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేయనున్నట్లు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో ఉన్న ఐఐహెచ్‌టీ ప్రమాణాలు తగ్గిపోతున్నాయని ఆ కళాశాల పూర్వపు విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చారని ఆయన చెప్పారు.



వెంకటగిరి: బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 21, 22 వార్డుల్లో శనివారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్లు సీహెచ్ ఉమామహేశ్వరి, ఎస్ బాలయ్య, విప్ లక్ష్మి, నాయకులు డీ రాధ, సీహెచ్ మురళి, గౌస్‌బాషా, తాజ్‌ఉద్దీన్, అనంతకుమార్, మున్నా, గౌస్‌బాషా, నజీర్ పాల్గొన్నారు.

మీ ఇంటి వద్దకే వచ్చాం..

సైదాపురం: 'మీ ఇంటి వద్దకే వచ్చాం. సమస్యలేమైనా ఉంటే చెప్పండి. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.' అని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతేగుంట ఎస్టీ, ఎస్సీ, బీసీ కాలనీలు, గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీసి, బుక్‌లెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యుడు వీ ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, నేతలు ఎస్ రామ్‌గోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, కే శివారెడ్డి, హరనాథ్‌రెడ్డి, యోగి, రవీంద్ర, శీనయ్య, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

చిల్లకూరు: మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి వెంబడి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న క్రమంలో రెవెన్యూ అధికారులు శనివారం ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మండలంలోని జాతీయ రహదారి పక్కనే పత్రిగుంట సమీపంలో కడివేడు రెవెన్యూకి చెందిన భూములను గతంలో పేదలకు పంపిణీ చేశారు. అయితే ఆ భూముల్లో ప్రస్తుతం బడా బాబులు ఆక్రమించుకోవడం, పేదలను మభ్య పెట్టి వారి దగ్గర అగ్రిమెంట్లు చేసుకుని స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల సాక్షి దినపత్రికలో 'పేదల భూముల్లో పెద్దల వ్యాపారం' అన్న శీర్షికతో కథనం



ఆక్రమిత భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో తహసీల్దార్ శ్రీనివాసులు భూములను పరిశీలించి, ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వీఆర్వో విద్యావతిని ఆదేశించారు. దీంతో ఆమె స్థానిక వీఆర్‌ఏలు శివ, విజయ సహకారంతో సర్వే నంబర్ 942లో ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు

దొరవారిసత్రం: మండలంలో నేలపట్టు-1, బేరిజంగాపల్లె, తనియాలి ఎస్సీ కాలనీలల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలను నిర్మిస్తున్నారు. నాడు-నేడు రెండో విడతలో ఒక్కొక్క భవనంకి రూ.13.50 లక్షలు మంజూరు చేశారు. ఈ భవనాల పనులు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల పర్యవేక్షణలో సాగుతున్నాయి. ఇప్పటికే బేరిజంగాలపల్లె అంగన్‌వాడీ కేంద్ర భవన పనులు శ్లాబ్ వరకు వచ్చాయి. నేలపట్టు-1 శ్లాబ్ స్థాయి వరకు గోడలు నిర్మించగా తనియాలి ఎస్సీ కాలనీలోని భవనం పనులు బేస్‌మెంట్



బేరిజంగాపల్లిలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనం

స్థాయిలో ఉన్నాయి. ఈ భవనం పనులు అన్నీ సకాలంలో పూర్తి చేయించేందుకు అన్ని చర్యలు చేపట్టామని ఐసీడీఎస్ సీడీపీఓ శారదాంబ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువు దీర్చి, విశేషాలంకరణ చేశారు. తరువాత వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు.



స్వామివాని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కళాకారుడికి ఆర్డీఓ అభినందన

గూడూరురూరల్: వెంకటగిరికి చెందిన ప్రముఖ పెన్సిల్ కళాకారుడు పోలిశెట్టి శంకర్‌బాబు శనివారం ఆర్డీఓ కిరణ్‌కుమార్ అభినందించారు. శంకర్‌బాబు గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ ను కలసి తను వేసిన ఆర్డీఓ పెన్సిల్ ఆర్ట్ చిత్రాన్ని స్వయంగా అందజేసి శాలువ కప్పి, సత్కరించారు. అనంతరం పెన్సిల్ కళాకారుడి ఆర్ట్‌ని చూసి, శంకర్‌బాబును ఆర్డీఓ అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కళాకారుడు శంకర్‌బాబును కూడా ఆర్డీఓ సత్కరించారు.



పెన్సిల్‌తో వేసిన చిత్రాన్ని ఆర్డీఓకు అందజేస్తున్న కళాకారుడు శంకర్‌బాబు

కాలువ ఏర్పాటుకు శ్రీకారం

చిల్లకూరు: మండలంలోని బల్లవోలు గ్రామంలో రైతులకు సాగునీరు అందించేలా కాలువను ఏర్పాటు చేసేందుకు శనివారం శ్రీకారం చుట్టారు. గ్రామానికి సమీపంలో ఉన్న చిట్టమరాజు సాన కాలువకు నీరు అందడం లేదు. దీంతో సుమారు 150 ఎకరాల వరకు వరిసాగు కష్టతరంగా మారింది. ఈ క్రమంలో సాన కాలువకు అనుబంధంగా బల్లవోలు డ్రెయిన్ నుంచి కాలువను తవ్వితే సాన కాలువకు నీరు అంది పుష్కలంగా పంటలు పండించుకునే వీలుంటుంది. దీనికి ఎక్కువ ఖర్చు అవుతుండడంతో దాతల సహకారం కోరారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీ శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ శ్యాంప్రసాద్‌రెడ్డి ముందుకు వచ్చి కాలువ తవ్వకానికి ఎంత అవసరమైనా తామే ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు యంత్రాలతో పనులను మొదలు పెట్టి సాన కాలువకు అనుబంధంగా కాలువ తవ్వకాలు చేపట్టారు.



కాలువ పనులు చేస్తున్న రైతులు

టీటీడీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



భూమన కరుణాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరురూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా నియమితులైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని శనివారం తిరుపతిలో ఆయన నివాసంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరు, ప్రజల స్పందన, 2024 ఎన్నికలకు సంబంధించి పలు విషయాలపై చర్చించినట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు.

చిట్టమూరులో మదర్ థెరిసా జయంతి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వాకాడు(చిట్టమూరు): స్థానిక జీఎంఎస్ జెడ్పీ హైస్కూలులో ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మదర్‌థెరిసా చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. మదర్ థెరిసా సేవలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మీనాకుమారి, ఉపాధ్యాయులు గిరిబాబు, సుబ్బయ్య, శ్రీనివాసులు, భరత్‌మహిపతి పాల్గొన్నారు.

విందూరు హైస్కూల్‌లో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు



వినియోగదారుల క్లబ్ ఎన్నికలో పాల్గొన్న విద్యార్థులు

గూడూరురూరల్: మండలంలోని విందూరు జెడ్పీ పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో శనివారం వినియోగదారుల క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌కు అధ్యక్షురాలిగా విష్ణుప్రియ, ఉపాధ్యక్షుడిగా అభిరామ్, కార్యదర్శిగా వెంకటజ్యోత్స్న, కోశాధికారిగా సాయి ఎన్నికయ్యారు. క్లబ్‌కు కన్వీనర్‌గా హెచ్‌ఎం మల్లికార్జున, కోఆర్డినేటర్‌గా పౌరశాస్త్ర అధ్యాపకులు ప్రవీణ్‌గురు వ్యవహస్తారని ఎన్నికల అధికారి తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నాయుడుపేట: పుదూరులోని అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రూత్‌రమోల తెలిపారు. ఆమె మాట్లాడుతూ పద్యపఠనం, సామెతలు, చిత్రలేఖనం, కవితలపై పోటీల నిర్వహణతో విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడానికే పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు 'అ..ఆ' అక్షరమాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మజ, తన్నీరు శశికళ, సుబ్బమ్మ, గీత, సునీత, భూలక్ష్మి, సుభాషిణి, పాల్గొన్నారు.



అ ..ఆ ఆకారంలో మానవహారం

లక్ష్మీనరసింహుడి సేవలో ఎమ్మెల్యే బియ్యపు మధు



ధ్వజస్తంభానికి మొక్కుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామివారిని శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి శ్రీవాణి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వేదపండితులు వారికి ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు, లక్ష్మీనరసింహుడి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక అజ్ఞాత భక్తుడు రూ.1,00,116 విరాళం అందజేసినట్లు ఈఓ తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీల్లో భాగంగా రెండో రోజైన శనివారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొని, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కే చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, సతీష్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినందన

గూడూరుకు చెందిన ఐదుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక కావడంతో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు వారిని అభినందించారు.

మదర్ థెరిస్సాకు నివాళి

మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా గూడూరులోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలో ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి ఎమ్మెల్యే వరప్రసాద్ రావు పూలమాల వేసి నివాళుర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఏ మురళి, భాస్కర్‌గౌడ్, పీ గోపాల్, వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

గూడూరులోని పలు వార్డుల్లో జీజీఎంపీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువ, కల్వర్టు నిర్మాణాలకు శనివారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు సతీష్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

ఘనంగా తపస్సుమాను ఉత్సవం

గూడూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చెన్నూరు అరుంధతీయవాడలో ఉన్న మాతా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న కొలుపులో భాగంగా శుక్రవారం రాత్రి తపస్సుమాను ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మాతాపరమేశ్వరి, పోతురాజు, ఇతర దేవతల ప్రతిమలను ఊరేగింపుగా తపస్సుమాను వద్దకు వేంచేపు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. పరశురాముడి వేషధారణ కలిగిన వ్యక్తి తపస్సుమాను ఎక్కి కొడిముద్దలను చల్లారు. కాగా శనివారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు కొలుపులో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెన్నూరు బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



మాతాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

ఓజిలి: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఏరియా కోఆర్డినేటర్ మురళి పేర్కొన్నారు. మండల వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఆధ్వర్యంలో సంఘమిత్రల వార్షిక మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మూడేళ్లుగా ఉన్న సంఘ బంధం అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, ఈసీలను మార్పు చేశామన్నారు. సంఘ బంధం బైలా ప్రకారం మూడేళ్లు పని చేసిన వారిని తొలగించి, కొత్తవారిని ఎన్నుకోవాలని తెలిపారు. దీంతో మండలంలోని 30 సంఘ బంధాలు నుంచి అధ్యక్షురాళ్లు హాజరై నూతనంగా సంఘ బంధం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. అధ్యక్షురాలిగా కాకాణి రమాదేవి, ఉపాధ్యక్షురాలిగా నెమళ్లపూడి మానస, కార్యదర్శి బండి లక్ష్మమ్మ, కోశాధికారి తుపాకుల సుబ్బమ్మ, సంయుక్త కార్యదర్శి మందపాటి పెంచలమ్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నిర్మలమ్మ, సీసీలు శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ మురళి

స్థలం కేటాయించండి

గూడూరురూరల్: పట్టణంలోని గాంధీనగర్‌వాసులకు హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వికలాంగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు చల్లా మోహన్, స్థానికులు శనివారం తహసీల్దార్ లీలారాణికి వినతిపత్రం అందజేశారు. మోహన్ మాట్లాడుతూ గూడూరు సమీపంలోని గాంధీనగర్, ఇందిరమ్మ కాలనీ, జగనన్న లేఅవుట్, టిడ్కో ఇళ్లు కలిపి సుమారు 10 వేల వరకు ఉన్నాయని, ఈ ప్రాంతంలో ఎక్కడా హిందూ శ్మశాన వాటిక లేకపోవడంతో మృతదేహాలకు దహన సంస్కారాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో 30 ఏళ్లగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అలాగే గాంధీనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



వినతిపత్రం అందజేస్తున్న గాంధీనగర్ ప్రజలు

వేడుకగా పల్లకీ సేవ



పల్లకిలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామివారు

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, ఊరేగించారు. ఈ కార్యక్రమానికి కలవకొండకు చెందిన కే నరేష్, వినీత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్మన్ కే ఆనంద్‌బాబు పర్యవేక్షించారు.